విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

- కడప స్టీల్ ప్లాంట్ తక్షణమే నిర్మాణం చేపట్టాలి
-నవంబర్ 8న విద్యాసంస్థల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎందరో ప్రాణత్యాగాలు, మరెందరో భూములు, ఇల్లు త్యాగం చేసి, త్యాగాల పునాదుల పైన నిర్మించిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మక తప్పిదమని వివిధ రాజకీయ పార్టీలు నాయకులన్నారు. గురువారం ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చౌదరి బాబ్జి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సింహాద్రి నాయుడు, సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, యూత్ కాంగ్రెస్ నాయకులు జగదీష్‌లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 32 మంది విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. భూములను స్టీల్ ప్లాంట్‌కు స్వచ్ఛందంగా అప్పగించారని, బలిదానాలకు, త్యాగాలకు విలువ ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం కొమ్ము కాసే కార్పొరేట్ కంపెనీల కోసం స్టీల్ ప్లాంట్ ను అమ్మకానికి ప్రయత్నించడం భారతదేశ జాతి ప్రయోజనాలను నిర్వీర్యం చేసే దిశగా కొనసాగుతుందని, వెంటనే స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కరణ ను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని లేనియెడల ఆనాడు విద్యార్థులు యువత పోరాటం చేసి ఏవిధంగా స్టీల్ ప్లాంట్ ను కాపాడుకున్నారో ఆ పోరాటాల ఆధారంగానే ముందుకు కొనసాగుతామని తెలియజేశారు. రాష్ట్రం అభివృద్ధి కుంటు పడిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర పౌరుల ప్రయోజనాలు పక్కన పెట్టీ వారి రాజకీయ పదవుల కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు నెలకొల్పి యువతకు ఉద్యోగాలు కల్పించాలే గానీ ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ లకు చౌకుగా అమ్మడం దుర్మార్గం అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేట్ పరం చెయ్యటం మాని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం త్వరగా పూర్తి చెయ్యాలని డిమాండ్‌తో నవంబర్ 8వ తేదీన కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని వారు కోరారు.

వ్యక్తి అదృశ్యం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం వండ్రవాడ పంచాయతీ, గుడ్డిమీద పేట గ్రామానికి చెందిన సూరాడా ఎర్రన్న 65 సంవత్సరాలు విశాఖపట్నం వెళ్లి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 24 న విశాఖపట్నం జిల్లా గంట్యాడ తన బంధువులు ఇంటికి ఒక శుభకార్యంలో పాల్గొన్నారు అని, అక్కడ నుంచి బయలుదేర నేటి వరకు ఇంటికి చేరుకోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9133959607 నెంబర్‌కు, పై చిరునామాకు తెలియజేయగలరని కుటుంబ సభ్యులు కోరారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ ఫెన్సింగ్ పోటీల్లో సత్తాచాటాలి

- జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించిన ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) అన్నారు. నగరంలోని టౌన్ హాల్ వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అండర్-19 జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎస్ జి ఎఫ్ కార్యదర్శి ఎన్ రామన్న, రాష్ట్ర స్థాయి అండర్ 19 పోటీల అబ్జర్వర్ డి.భవానీ(పి.డి) లు పాల్గొన్నారు. ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను వచ్చే నెల 1,2,3తేదిలలో నంద్యాలలో జరుగబోయే రాష్ట్రస్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీలకి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ నిరంతర సాధన ద్వారా పోటీలలో విజయం సాధించవచ్చన్నారు. ఈ పోటీలకి న్యాయ నిర్ణేతగా ఫెన్సింగ్ ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ, పిఈటి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం తెలుగుశక్తి ప్రజా చైతన్య యాత్ర

- జగన్ భజన కోసమే వైకాపా సామాజిక బస్సు యాత్ర
- జగన్‌కి చేదోడువాదోడుగా నిలిచిన కిల్లి కృపారాణి దంపతులకు మొండి చేయి
- అరసవిల్లిలో యాత్ర ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

విశాలాంధ్ర-అరసవల్లి : వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఎవరు సహాయకారిగా వుంటే వారినే దూరం చేసుకుంటారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. గురువారం అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం ఆలయ ఆవరణలో చంద్రబాబునాయుడు విడుదల కావాలని ఆకాంక్షిస్తూ పెద్ద సంఖ్యలో కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి జైలులో ఉన్నప్పుడు ఆయన తల్లి వైయస్ విజయలక్ష్మి, చెల్లి షర్మిల అహ రహం శ్రమించారన్నారు. షర్మిల జగనన్న వదిలిన బాణాన్ని అంటూ 3000 కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. అయినప్పటికీ తల్లిని చెల్లిని వైయస్ జగన్మోహన్ రెడ్డి దూరం పెట్టారని విమర్శించారు. ఇది ఇలా ఉండగా బీసీలే తన సర్వస్వం అంటూ జగన్ బీసీలకు నిలువునా మోసం చేస్తున్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఓదార్పు యాత్ర చేస్తున్నప్పటి నుంచి శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ కిల్లి కృపారాణి, డాక్టర్ రామ్మోహన రావు దంపతులు జగన్ కు చేదోడు వాదోడు గా నిలిస్తే వారికి మొండి చేయి చూపారన్నారు. 26 జిల్లాల్లో ఎక్కువ బీసీ లు, ఎక్కువ కాలింగులు ఉన్నది శ్రీకాకుళంలోనే అన్నారు. అయినప్పటికీ కేంద్ర మంత్రి గా చేసిన అనుభవనంతోపాటు విద్యా వంతురాలు అయిన కిల్లి కృపారాణికి కాకుండా తెలంగాణకు చెందిన కృష్ణయ్యకు జగన్ రాజ్యసభ సీటు ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 11 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రజలపై పెను భారం మోపారన్నారు. రాబోయే ఎన్నికలలో వైసీపీ ఓటమి తర్వాత 11 లక్షల కోట్ల రూపాయల అప్పులు ఎవరు తీరుస్తారో సమాధానం చెప్పి వైసీపీ బస్సుయాత్ర ప్రారంభించా లన్నారు. ఇదిలాఉండగా వైఎస్ జగన్ గత పది సంవత్సరాలనుంచి బెయిల్‌పై ఉన్నారంటే.. ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఉన్నాయని రామ్ ఆరోపించారు. తెలుగుదేశం శ్రీకాకుళం ఇన్‌చార్జ్ గుండా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. బి.వి.రామ్ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పతనం కాక తప్పదని, ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మాజీ మంత్రి సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు గుండ అప్పల సూర్యనారాయణ మాట్లాడుతూ 45 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో వైయస్ జగన్ ప్రభుత్వం లాంటి దౌర్భాగ్యపు ప్రభుత్వాన్ని ఎప్పుడు చూడలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు బోడేపూడి దొరబాబు, డాక్టర్ పపూర్ నికుంజ్, కె.సుశీల, శ్రీకాకుళం నియోజకవర్గ నగర పార్టీ అధ్యక్షులు మాదరపు వెంకటేష్, నగర బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి, గార మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, నియోజకవర్గం రైతు సంఘ కార్యదర్శి ఇప్పిలి శివ, జిల్లా బీసీ సోషల్ మీడియా కన్వీనర్ బుక్కా యుగంధర్, జిల్లా కోఆర్డినేటర్ మెండ గిరీష్ ప్రతాప్, టీడీపీ నాయకులు సతీష్ బాబా, ఉంగటి రామ్మోహన్, కునుకు గోవింద, డివిజన్ ఇన్‌చార్జి లు కవ్వాడి సుశీల, కొమర కమల, కరగాన రాము, ఉంగటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటో: నినాదాలు చేస్తున్న రామ్: 26ఎస్‌కెఎల్ఎం03

ప్రతి పేద కుటుంబానికి వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యం

విశాలాంధ్ర-పాతపట్నం : మండలం తీమర గ్రామంలో సర్పంచ్ ప్రతినిధి ఇప్పిలి ధనుంజయరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపట్నం మండలం జగనన్న సచివాలయాల కన్వీనర్ ఏనుగుతల సూర్యం మాట్లాడుతూ పేదవాడు డబ్బులేక వైద్యానికి దూరంగా ఉండకూడదని ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆంధ్రప్రదేశ్ లో ప్రతి కుటుం ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యం అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాన్ని పూర్తిగా మ్యాపింగ్ చేసి. ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటినీ, జల్లెడ పట్టి, ఏ ఇంట్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ఆ ఇంటి దగ్గరే 7 రకాల పరీక్షలు చేసి వారికి వైద్య సేవలు అందించేటట్టుగా రూపొందించిన ఈ కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. మన రాష్ట్రంలో సుమారు 5 కోట్ల 40 లక్షల మంది ప్రజలు బాగుండాలని దేశంలో ఏ రాష్ట్రంలో ఏ విధంగా మన ముఖ్యమంత్రి ప్రజలు నిండు నూరేళ్ళు చల్లగా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కే రవిచంద్ర, ఎండిఓ జయంతి ప్రసాద్ ఈఓపిఆర్డి కృష్ణారావు, డాక్టర్ ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్య బృందం మరియు పారా మెడికల్ సిబ్బంది ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, తీమర సర్పంచ్ ప్రతినిధి ఇప్పిలి ధనుంజయరావు రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది వాలంటీర్లు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన ఉద్దానం జగనన్న లక్ష్యం : మంత్రి బొత్స

విశాలాంధ్ర-పలాస : జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రజా సంకల్ప పాదయాత్రలో ఉద్దాన ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం సామాజిక సాదికార బస్సు యాత్రలో భాగంగా పలాస టికెఆర్ కళ్యాణ మండపంలో పలాస కాశీబుగ్గకు చెందిన మేధావి వర్గంతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వాస్తవాలు తెలుసు కోవాలని ఎన్నో ప్రభుత్వాలు రాష్ట్రాన్ని పాలించాయని కానీ ఉద్దానం కష్టాలు తీర్చే దాఖలాలు లేవన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ఉద్దాన ప్రజలకు జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి పలాసలో కిడ్నీ ఆసుపత్రికి శంకుస్థాపన చేసారని ప్రస్తుతం నిర్మాణం పూర్తయిన త్వరలో ప్రారంభించుకుంటామన్నారు. ఆరోగ్య వంతమైన ఉద్దానాన్ని చూడాలనేది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. ప్రజలు ప్రతి విషయాన్ని గమనించాలని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్నారు. ప్రభుత్వ పరిపాలనా, సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు ఏవిదంగా అందిస్తూ ముందుకు పోతున్నామో తెలియజేయడమే ముఖ్య ఉద్దేశంతో బస్సు యాత్ర చేపట్టామని అన్నారు.

మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే ముఖ్య ఉద్దేశంతో బస్సు యాత్ర చేపట్టామని మంత్రి తెలిపారు. పలాస నియోజకవర్గంలో 7 వందల కోట్ల రూపాయలతో మంచినీటి పథకం, కిడ్నీ ఆసుపత్రి నిర్మాణం, సచివాలయాలు నిర్మాణం, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పన చేపట్టామని అన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు ఆధునీకరణ చేపట్టడమే కాకుండా కొత్తగా ఆసుపత్రులు నిర్మాణం చేసిన ఘనత కూడా జగనన్న ప్రభుత్వానిదే అని తెలిపారు. గతం కంటే మెరుగుగా ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ అన్నివర్గాలకు సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు వైవి సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు ధర్మాన క్రిష్ణదాస్, మంత్రి మేరుగ నాగేశ్వరరావు, తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన కొత్తూరు వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-కొత్తూరు : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైసీపీ పార్టీ ఉత్తరాంధ్ర బాధ్యులు వైవి సుబ్బారెడ్డిని విశాఖపట్నంలో కొత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పాతపట్నం నియోజకవర్గ సమస్యలు, పార్టీ పరిస్థితిని వివరించినట్లు వైసీపీ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడా సూర్యనారాయణ ఇక్కడ మీడియాకు ఫోన్‌లో తెలిపారు. గడప గడపకు కార్యక్రమం నిర్వహణలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి జిల్లాలో ముందంజలో ఉన్నారు. అభివృద్ధి పనులు కూడా అక్కడ బాగా జరిగాయని వైవిఎస్ఆర్ ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో మరళా ఆమెకే పార్టీ టికెట్ అని అన్నారని చింతాడ తెలిపారు.

చంద్రబాబునాయుడుకు మద్దతుగా సైకిల్‌పై పుణ్యక్షేత్రాల యాత్ర

విశాలాంధ్ర-రణస్థలం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు సంఘీ భావంగా, ఆయన త్వరగా ఈ కేసుల నుండి బయట పడాలని, రణస్థలం మండలం, నారువ మాజీ సర్పంచ్ నిద్రభింగి రామకృష్ణ తోపాటు వారి బృందం రాష్ట్రంలో ఉన్న పుణ్య క్షేత్రాల దర్శనం కోసం సైకిల్ యాత్ర చేపట్టారు. అలాగే మార్గ మధ్యలో పుంగనూరు వైసీపీ దుష్ట శక్తుల అరాచకాలను ఆదిగమించి దిగ్విజయంగా యాత్రను పూర్తి చేసుకొని ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలానికి చేరుకున్న నేపథ్యంలో పైడిభీమవరం దగ్గర తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిమిడి కళా వెంకట్రావు, విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఘన స్వాగతం పలికారు. వీరితోపాటు శ్రీకాకుళం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మిదేవి, మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, రణస్థలం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరంలో అడవి పందుల సంచారం... పంట పొలాల ధ్వంసం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం నౌపాడ పంచాయతీ, సీతానగరం పంట పొలాల్లో అడవి పందులు స్వైర విహారం చేసి పంటలను మోసం చేశాయి. ఇప్పటివరకు వర్షం కురువక, వంశధార నీరు లేక ఎండిపోతున్న పంటలను రక్షించేందుకు రైతులు నానాయాతనలు పడుతూ ఉన్న సమయంలో, మరో పక్క అడవి పందులు సంచారంతో పంట పొలాలు ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులు అడవిపందులు నుంచి రక్షించి రైతులను కాపాడాలని కోరుతున్నారు.

27న డ్రాఫ్ట్ రోల్స్ ప్రచురణ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో మొత్తం 299 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు సంబంధించిన డ్రాఫ్ట్ రోల్స్‌ను ఈ నెల 27న ప్రచురించి వెల్లడించడం జరుగుతుందని ఈ.ఆర్.ఓ సుమబాల తెలిపారు. ఆ రోజున ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద లిస్టులను అందుబాటులో ఉంచుతామని, ఎవరికైన అభ్యంతరాలు ఉంటే తెలుపవచ్చని అన్నారు. కొత్త ఓటర్ నమోదుకు ఫారం-6, తొలగింపులు ఫారం-7, మార్పులు ఫారం-8లను ఆన్‌లైన్ లేదా బి.ఎల్.ఓ‌లు, తహశిల్దార్ వద్ద డిసెంబర్ 9 వరకూ స్వీకరిస్తామని తెలిపారు. అర్బన్‌లో 29,601మంది ఓటర్లలో పురుషులు 14,105, మహిళలు 15,489, లింగమార్పిడి కల్గిన వారు ఏడుగురు, రూరల్‌లో 46,202మందికి గాను ఇద్దరు లింగమార్పిడి కల్గిన వారితో పాటు స్త్రీలు 23,792మంది, పురుషులు 22,408మంది; కవిటి మండలంలో మొత్తం 61,711మందిలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లతో పాటు మహిళలు 31,657, పురుషులు 30,052మంది; కంచిలి మండలంలో 54,706మందికి గాను పురుషులు 26,794మంది, స్త్రీలు 27,911మంది ఒక ట్రాన్స్‌జెండర్; సోంపేట మండలంలో 68,544మందికి గాను నలుగురు లింగమార్పిడి కల్గిన వారు, స్త్రీలు 34,664మంది పురుషులు 33,876మంది ఉన్నట్లు తహశిల్దార్ కార్యాలయం వెల్లడించింది.

ఈ క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఈ క్రాప్ పంట నమోదు కార్యక్రమంలో ఎటువంటి తప్పులు ఉన్న రైతులు సరి చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు తెలిపారు. మండలంలోని కట్యా చార్యుల పేట రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ఈ క్రాప్ పంట నమోదు చేసిన జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రద ర్శించడం జరిగింది. ప్రతి రైతు భరోసా కేంద్రంలో అక్టోబర్ 26 నుంచి 29వరకు ఈక్రాప్ నమోదు జాబితాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రైతులు వారి పంట వివరాలను సరి చూసుకుని ఎటువంటి తప్పులు ఉన్న సరి చేసుకోవాలని కోరారు. రైతులకు ఎదురైన సమస్యలను గ్రామ సభల ద్వారా వచ్చిన అభ్యర్థనలను పొందుపరిచి రైతు భరోసా కేంద్రాల్లో సరి చేయడం జరుగు తుందన్నారు. ఈ విషయాన్ని రైతుల గ్రహించి ఆర్బికేలు వద్దకు వెళ్లి వారి సాగుచేసిన పంట వివరాలను అన్ని సరిచూసుకోవాలని వివరించారు. ఆర్‌బికే గ్రీవెన్స్‌లో రైతు వివరాలను మార్పు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవ సాయ అధికారి మెట్ట మోహనరావు ఏఈఓ, కట్యాచార్యులపేట వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

విశాలాంధ్ర-మందస: మండలం చిన్నలోహరి బందకు చెందిన తామాడ కామమ్మ (70) సమీప జీడి తోటలో అనుమానా స్పదస్థితిలో మృతిచెంది నట్లు ఆమె కుమారుడు గురువారం గుర్తించారు. ఆమె దినచర్యలో భాగంగా ప్రతి రోజు జీడి తోటకు వెళ్తుండేది. బుధవారం పెద్ద కుమారుడు, కోడలు తోటలో పనులు ముగించుకొని ఇంటికి వచ్చే సరికి తల్లి ఇంటికి చేరకపోవడం గమనించారు. వెంటనే ఆమెకు చెందిన ముగ్గురు కుమారులు జీడి తోటలో తల్లి కోసం వెతుకుతుండగా తలపై గాయంతో చనిపోయినట్లు గుర్తించారు. ఆమె వేసుకున్న బంగారం నాగులు, కమ్ములు తెంపుకొని గుర్తు తెలియని వ్యక్తులు పరారైనట్లు గమనించారు. ఈ విషయమై మందస పోలీసుస్టేషన్‌లో ఆమె పెద్ద కుమారుడు తామాడ రామ్మూర్తి ఫిర్యాదు చేయడంతో ఎస్.ఐ హరిక్రిష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం - ఆర్డీవో భరత్ నాయిక్

విశాలాంధ్ర-పలాస: పలాస రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, పేదలకు అండగా ఉంటానని పలాస ఆర్డీవో భరత్ నాయిక్ అన్నారు. గురువారం పలాస ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలాస డివిజన్ పరిధిలో అపారమైన సహజ వనరులు కలిగి ఉన్నాయని, డివిజన్‌కు అన్ని రంగాల్లో అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. డివిజన్ పరిధిలో భౌగోళిక పరిస్థితులను అవగాహన చేసుకొని ఈ ప్రాంతాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశీలన చేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని అన్నారు. విశాల సముద్ర తీరంతో పాటు ఉద్దానం, పల్లపు, గిరిజన ప్రాంతాలు కలిగి ఉన్న ఈ డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ ప్రభుత్వాలు అందించే సంక్షేమ, అభివృద్ధి ప్రజలకు చేరువ చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఎవరికి ఎ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో భరత్‌నాయిక్‌కు తహాశీల్దార్ మధుసూధనరావు, ఎంపిడివో రమేష్‌నాయుడు, విఆర్‌వో సంఘం నాయకులు ఆర్డీవోకు ఘనంగా సన్మానం చేశారు.

సమీకృత సేకరణ కేంద్రాలను సంఘాలన్నీ సద్వినియోగం చేసుకోవాలి

సూక్ష్మ నీటిపారుదలశాఖ పీడిఆర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-కవిటి : సమీకృత సేకరణ కేంద్రులను రైతు ఉత్పత్తిదారుల సంఘాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని సూక్ష్మనీటి పారుదలశాఖ పీడి ఆర్ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం కవిటి, ఇచ్ఛాపురం మండలలలోని నిర్మాణం పూర్తయినటువంటి సమీకృత సేకరణ కేంద్రులను (కలెక్షన్ సెంటర్లను) జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్‌వివి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మండలం లోని కవిటి,రామయ్యపుట్టుగ, కపాసుకుద్ది గ్రామాలలో నిర్మించినటువంటి సమీకృత సేకరణ కేంద్రాలను పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు కేంద్రులను వినియోగపర్చుకోవాలని వారు కోరారు.ఈ కేంద్రాల యొక్క ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి పి మాధవి లత, హెచ్ఈఓ టి బాలరాజు, ఎం ఐ ఈ, ఏపీఎంఐపి బి హరి ప్రసాద్,ఎంపీఈవోలు ఎం లలిత, వై విష్ణు,ఎఫ్ పి ఓ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతులను విస్మరించడం తగదు

జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-పలాస: జీడి మద్దతు ధర ప్రకటించాలని, 80కేజీల బస్తా 16వేల రూపాయలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జీడి రైతులను విస్మరించడం తగదని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశీబుగ్గలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీడిపిక్కలకు గిట్టుబాటు ధర ప్రకటించాల్సి ఉన్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గత ఆరునెలలుగా గిట్టుబాటు ధర కోసం అనేక ఆందోళనలు చేపట్టినా స్పందించకపోవడం దారుణమన్నారు. వైసీపీ నేతలే చేపడుతున్న సామాజిక బస్సు యాత్ర ఇంకా ఏ ప్రజల్ని మభ్యపెట్టడానికి అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం చేయకుండా రైతుల గోడు వినకుండా యాత్రలు చేయడం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీడి రైతులకు న్యాయం చేయాలని, 80కేజీల బస్తాకు 16వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయించి, ఆర్‌బికెలు ద్వారా కొనుగోలు చేయాలని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో కె.వినోద్‌కుమార్, కె.గురయ్య, అంబటి రామక్రిష్ణ, తిర్రి శాంతారావు, ఎన్.గణపతిలు పాల్గొన్నారు.

వల్లభరావుపేట గ్రామంలో జగనన్న సురక్షా కార్యక్రమం

విశాలాంధ్ర-రణస్థలం : వల్లభరావుపేట గ్రామంలో గురువారం జగనన్న సురక్ష మెగావైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాలుగు వందల ఇరవై మంది కి వైద్య సేవలు నిర్వహించి మందులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ప్రతినిధి పి.సాయికుమార్, జడ్పిటిసి సీతారామ, జెసిఎస్ కన్వీనర్ వెంకట్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు గురాణ మానస, చిరంజీవి, అదేవిధంగా గ్రామ పెద్దలు జి.చిరంజీవి, ఎం.సత్యనారాయణ, గడి రమణ, గడి సత్యం, కే పర్సనాయుడు, కీర్తి మంగ, గ్రామ యువత గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫలకంపై ఫోటో లేదని వెనుతిరిగిన స్పీకర్

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: కొమనాపల్లి నుండి సరుబుజ్జిలు మీదుగా వెళ్లే జర్జంగి జగన్నాధపురం రోడ్డు 0/0 నుండి 5/735 వరకు సుమారు రూ. 2.20 కోట్ల ఎస్.ఆర్.పి నిధులతో జరుగు పనులకు సరుబుజ్జిలి మండల కేంద్రంలో శంకుస్థాపన చేయడానికి వచ్చిన స్పీకర్ తమ్మినేని సీతారాం. శిలాఫలకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని వేయలేదంటూ శిలాఫలకం ఆవిష్కరణ నిరాకరించారు. ఫలకంలో ముఖ్యమంత్రి చిత్రపటం లేదని అధికారులపై మండిపడ్డారు. ఫోటో చిత్రీకరించి మరోసారి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు తెలియజేశారు. చిత్రపటం లేదని శిలాఫలక ఆవిష్కరణ నిరాకరించడం సబబు కాదని, సభాపతి హొదాలో ఉన్న తమ్మినేని ఈ విధంగా ప్రవర్తిస్తూ భావితరాలకు ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారో.! అంటూ స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, వైసిపి సర్పంచులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయానికి కుర్చీలు వితరణ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని కుసుంపురం గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజన సేవా సంఘం సభ్యులు బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానంకు 30 ప్లాస్టిక్ కుర్చీలు,స్వామి వారి నిత్య కళ్యాణం కోసం కావలసిన ఇత్తడి సామగ్రిని వితరణగ అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘ కోశాధికారి మోహన్ దొళాయి మాట్లాడుతూ సంస్థలో ప్రముఖ వ్యక్తుల ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో బల్లిపుట్టుగ సర్పంచ్ శ్రీ కన్య రజనీ దొళాయి, సంస్థ సభ్యులు బత్తిన గోపాలరావు,నాగు,సురేష్, చలపతి, కేశవ, రమేష్, బాషా, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

విశాలాంధ్ర-కవిటి: మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులకు మీటర్ రీడర్లు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం ఇచ్ఛాపురంలో జరిగిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర బహిరంగ సభలో నియోజకవర్గ మీటర్ రీడర్లు బి.ఆనంద్,డి.భాస్కర్ లతో పాటు పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్లకు ఉపాధి ప్రమాదం పొంచి ఉన్నది కావున ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు తాడివలస విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-పొందూరు: రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండలం తాడివలస ఉన్నత పాఠశాల నుంచి 5గురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య మరియు వ్యాయామ ఉపాధ్యాయులు ధవళ పెంటయ్య తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో అనంతపురంలోని ఆర్. టి. డి స్టేడియంలో జరుగనున్న జూడో పోటీల్లో కొత్తకోట నితిన్, వాకముల్లు కౌశిక్, కూన శివరామరాజు, మెట్ట ఛార్మి, మరియు గొల్లపల్లి నీలిమ పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ జూడో పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తేవాలని విద్యార్థులను ఆశీర్వదించారు.

పాలక మండలి సభ్యులుగా దుప్పల వెంకట్రావు నియామకం పట్ల హర్షం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: శివాణి ఇంజినీరింగ్ విద్యాసంస్థల అధినేత దుప్పల వెంకటరావు విజయనగరం జె.ఎన్.టి.యు విశ్వవిద్యాలయం పాలనా మండలి సభ్యులుగా ఎంపిక కావటం పట్ల గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, డైరెక్టర్ సంయుక్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన వెంకట్రావు సేవలను ప్రశంశించారు. విశ్వ విద్యాలయాభివృద్ధికి వీరి సేవలు ప్రయోజనకరమని అయన అన్నారు.

ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర నవంబర్ 2వ తేదీన మందసలో సిపిఎం పార్టీ అఖిలభారత నాయకులు కామ్రేడ్ విజ్జు కృష్ణ ప్రారంభిస్తారని దానిని విజయవంతం చేద్దామని సిపిఎం పార్టీ నాయకులు హనుమంతు ఈశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లౌకికవాదం ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఆదోనిలో, పార్వతీపురం జిల్లా సీతంపేటలో, బస్సు యాత్రలు ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా ప్రసారం చేస్తూ నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందని , ఈ బహిరంగ సభలో అత్యధిక ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. బిజెపి పాలనలో మొత్తం దేశం అస్తవ్యస్తముగా తయారైందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదనంతా అదాని అంబానీలకు దోచిపెడుతుందని విమర్శించారు, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్రంలో ఉండే అధికార వైసిపి, ప్రతిపక్ష టీడీపీ జనసేన అంట భాగుతున్నాయని వారు విమర్శించారు. రాష్ట్రంలో ఉండే ప్రధానమైన పోర్టులు కృష్ణపట్నం గంగవరం పోర్టుతో పాటు రాష్ట్ర సంపద అంతా ఒక్కొక్కటిగ అదానికి అప్పజెప్తున్నారని దీనిపైన వైసిపి టిడిపి పొల్లెత్తి మాట్లాడటం లేదని వారు విమర్శించారు. కేంద్రంలోని బిజెపి నాయకులు ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగ నమ్మడానికి తయారయిందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొండు నీలన్న, జోగి లక్ష్మణరావు , సిహెచ్ వెంకట్రావు కే. అప్పలస్వామి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం... జగనన్న సురక్ష : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు వరమని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోగల కురుడు గ్రామ సచివాలయ పరిధిలో జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానంవల్ల ప్రజల్లో పలు రకాల రుగ్మతలు తలెత్తుఉన్నాయన్నారు. అందుకు తగినట్లుగానే వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందని దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రజలవద్దకే వైద్యం తీసుకు వచ్చారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యరాలు డాక్టర్లు డి.నీరజ, మనీష ప్రీతి, జోత్న, సురేష్, నితీష్‌కుమార్‌లు 391 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. మధు, ఈవోపీఆర్‌డీ బొడ్డేపల్లి రామారావు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, రొక్కం సూర్యప్రకాష్, స్థానిక సర్పంచ్ కోతి చిన్నారావు, నాయకుడు పేడాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బి.ఎస్.ఎన్.ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో బి.ఎస్.ఎన్.ఎల్ వినియోగదారులకు పారదర్శకమైన, మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో అక్టోబరు 30వ తేది నుండి నవంబరు 5వ తేది వరకు బి.ఎస్.ఎన్.ఎల్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జనరల్ మేనేజర్ జె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలు శ్రీకాకుళం కార్యాచరణ ప్రదేశంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బి.ఎస్.ఎన్.ఎల్ సంస్థకు సంబంధించిన అవినీతిపై ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని, తమ ఫిర్యాదులను ఉప మండల ఇంజనీర్ (విజిలెన్స్), జనరల్ మేనేజర్ కార్యాలయం, సంచార్ భవన్, శ్రీకాకుళంనకు స్వయంగా గాని, పోస్టల్ ద్వారా గాని అందజేయవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలు, సందేహాలు కొరకు 08942-226700,9441668789 నంబర్లకు సంప్రదించవచ్చునని తెలిపారు.

జగనన్న భూహక్కు పత్రాలపై ప్రచారం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం రూంకు హనుమంతుపురం పంచాయతీలో గురువారం జగనన్న భూహక్కు పత్రాలు వినియోగంపై, స్థానిక సర్పంచ్ ఎన్ని మన్మధరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రతీ రైతుకు భూహక్కు కల్పించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి . జగనన్న ప్రభుత్వం లక్ష్యమని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో బాలయోగి, సచివాలయం అధికారులు, వాలంటీర్లు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ముందస్తు నోటీసులతో సీపీఎస్ వ్యతిరేక ఉద్యమాలు ఆపలేరు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ముందస్తు నోటీస్‌లతో సీపీఎస్ వ్యతిరేక ఉద్యమాలను ఆపలేరని జిల్లా సీపీఎస్ కన్వీనర్ గొండు నారాయణరావు అన్నారు. గురువారం ఇచ్చాపురం నుంచి వైఎస్సార్‌సీపీ మంత్రులు చేసే బస్సు యాత్రలో సీపీఎస్ రద్దు చేయాలంటూ ఆటంకం కలిగించవద్దని కోటబొమ్మాళి పోలీసులు జిల్లా సీపీఎస్ కన్వీనర్ గొండు నారాయణరావు ఇంటి వద్దకు వచ్చి 149 సీఆర్ పీసీ ముందస్తు నోటీసులు అందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బేషరతుగా సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలుచేసే వరకు యుటీఎఫ్‌గా ప్రభుత్వం వెంట పడుతూనే ఉంటామని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీని గుర్తు చేసుకొని వెంటనే సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పింఛను విధానంను అమలు చేయాలని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని 3 లక్షల కుటుంబాలు అనగా సుమారుగా 10లక్షల ఓటర్లు సీపీఎస్ రద్దు చేసే పార్టీల వైపే ఉంటారని కన్వీనర్ తెలిపారు.

దేశానికి జాతిరత్నాలను అందించింది కాంగ్రెస్ పార్టీ

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరాడ పరమేశ్వరరావు

విశాలాంధ్ర-పలాస : దేశానికి జాతి రత్నాలను అందించింది కాంగ్రెస్ పార్టీయేనని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేరాడ పరమేశ్వరరావు అన్నారు. గురువారం కాశీబుగ్గలో ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితుల ప్రభావం వలన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లిపోయిన లేదా స్తంభితగా ఉండిపోయిన నాయకులను ద్వితీయ శ్రేణి కేడర్‌ను తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమాన్ని "మన ఇంటికి రండి.." పేరుతో జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న నేతల మాటలకు విలువ ఇవ్వకపోవడం స్వేచ్ఛ లేకపోవడంతో ఆయా రాజకీయ పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. మేధావులు, విద్యావంతులు, యువకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు సముచితంగా ఉన్నారని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులతో పాటు ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారని, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను గాలికి వదిలి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ఆయనతో పాటు పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూధనరావు, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాసుమాన శ్యామసుందరరావు, మజ్జి బాబూరావు, కర్రి శాంతారావు, కోర్ల హేమారావుచౌదరి, బమ్మిడి రాజారావు, తంగుడు వీర్రాజు, శ్రీరంగం సురేష్‌లు పాల్గొన్నారు.

సర్వమానవ ఆరోగ్యానికి... వాకర్స్ క్లబ్స్ దోహదపడతాయి

ఈనెల 31న ఆళ్వార్దాస్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: సంపూర్ణ ఆరోగ్యం వాకర్స్ క్లబ్స్ సభ్యులగా చేరటంతో సాధ్యమౌతుందని ప్రతీ ఒక్కరూ విధిగా వయస్సుతో సంబంధం లేకుండా మీమీ ప్రాంతాల్లో ఉన్న వాకర్స్ క్లబ్స్‌లో చేరాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్‌లు జి.ఇందిరా ప్రసాద్, పి.జి.గుప్తాలు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ సారథ్యంలో స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్ జయంతి వేడుకల సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ ఆరోగ్య ప్రదాతలుగా, సేవాతత్పరులుగా నిలవటానికి వాకర్స్ సంస్థలు ఎంతో దోహదపడుతాయన్నారు. 1986లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నంలో స్థాపించిన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలో ప్రస్తుతం 5లక్షల మంది సభ్యులు ఉన్నారని, దేశ విదేశాల్లో వాకర్స్ క్లబ్స్ విస్తరించాయని అన్నారు. రోటరీ, లైన్స్ వంటి క్లబ్స్ వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వవని, కేవలం సామాజిక సేవలకు మాత్రమే పరిమితమన్నారు. ప్రపంచంలో ఎన్నో సంస్థలు ఉన్నా సంపూర్ణ ఆరోగ్యం వాకర్స్ క్లబ్స్ మాత్రమే అందిస్తాయని అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు అంతా వాకర్స్ క్లబ్స్ వ్యవస్థాపకులు స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్ జయంతి వేడుకలు ఘనంగా ఈనెల 31న జరపడానికి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, గురు ఆనందరావు, ఎస్.సంజీవరావు, గోలీ ఉమామహేశ్వరరావు, ఎం.మల్లిబాబు, గుడ్ల జగ్గారావు, నల్లబాటి కృష్ణమూర్తి, వై.మోహన్, బి.కృష్ణారావు, జి.లక్ష్మీ, పట్నాన సత్యనారాయణ, బొడ్డేపల్లి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో డీఆర్‌వో సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ ఈ నెల 27న జరగనుందని, వాటిలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని రెవెన్యూ అధికారి వారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో 15వ వారపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతిరావు మాట్లాడుతూ ఓటరు లిస్టులను ప్రతి ఒక్కరు పరిశీలించుకోవాలని వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఫారం 6,7,8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని, ముసాయిదాలోని క్లైములు, అభ్యంతరాలను అక్టోబర్ 27వ తేది నుండి డిసెంబరు 9వ తేది వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించడం జరుగుతుందని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కమిషను ఆదేశాలమేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఆయా తేదీలను ముందుగా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి తప్పుడు ఫారం 7 లు అందజేస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. బ్యాలెట్ యూనిట్ లు 7530, కంట్రోల్ యూనిట్లు 5850, వివిపాట్ లు 7070 జిల్లాకు చేరాయని చెప్పారు. మొదటి దశ తనిఖీల ప్రకారం 7523 బ్యాలెట్ యూనిట్లు గాను 2440, 5831 కంట్రోల్ యూనిట్లు గాను 2020, 7105 వివిపాట్ లు గాను 2300 పూర్తిగా పనిచేసున్నాయని అన్నారు.బ్యాలెట్ యూనిట్లు 4, కంట్రోల్ యూనిట్లు 8, వివిపాట్లు 24 తిరస్కరించడం జరిగిందని, తిరస్కరించిన వాటిని వెనుకకు పంపించడం జరుగుతుందని అన్నారు.ఈ వి ఎమ్ ల వినియోగంలో ఎటువంటి అపోహలు ఉన్నా నిపుణులు నివృత్తి చేస్తారని తెలిపారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేస్తే వాటిని సరిదిద్దుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, శుద్ధమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయపార్టీలు, ప్రజలు సహరించాలని కోరారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, కాంగ్రెస్ పార్టీ నుంచి దేసెల్ల గోవింద మల్లి బాబు,సి పి ఐ పార్టీ ప్రతినిధి బి. కృష్ణమూర్తి, సి పి యం పార్టీ ప్రతినిధి డి. గోవిందరావు, సెక్షన్ సుపరెడెంట్ ప్రకాష రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మానకు ఫ్యామిలీ కోర్టు పీపీ వాన కృష్ణచంద్ అభినందన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: కోడి రామ్మూర్తి స్టేడియం ఆధునికీకరణ పనులకు మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో 12 కోట్లు మంజూరు జరగడం ధర్మాన కృషి అభినందనీయమని ఫ్యామిలీ కోర్టు పిపి, శ్రీకాకుళం బార్ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షులు వాన కృష్ణచంద్ తెలిపారు. 'కోడిరామమూర్తి స్టేడియం ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు నకు కృషిచేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావును గురువారం జిల్లా ఫ్యామిలీ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణ చంద్, కొమరాపు నాయుడు లు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ చంద్ మాట్లాడుతూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అభివృద్ధికి చిరునామా అని, దూరాలోచన గల వ్యక్తి, తన విజన్ తో మన శ్రీకాకుళం నగరం లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన వ్యక్తి గా ఆయనకు పెరుందన్నారు. 2019 అసెంబ్లీ ఎలక్షన్‌కు ముందు క్రీడాకారులకు, క్రీడాభిమానులకు, వృద్ధులకు వాకర్స్ కు తాను ప్రామిస్ చేసినందున నేడు ముఖ్య మంత్రిని ఒప్పించి, ప్రతిష్టాత్మ కమైన కోడి రామమూర్తి స్టేడియం ఆధునీకరణకు రూ.12 కోట్లు మొత్తాన్ని జారీచేయటం అభినందిం చదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వ పథకాల వలన, నిర్మాణాల వలన, వచ్చే ఫలితాలు ప్రజలకు శీఘ్రంగా చేరాలనేదే ఆయన తపన, తాపత్రయం అని వివరించారు. ఆర్థిక సంక్లిష్ట పరిస్థితిలో కూడా వంశధార ప్రాజెక్టుకు ఇతోధికంగా నిధులు మంజూరు చేయుటలో, రాష్ట్ర రెవిన్యూ, మరియు రహదారులు భవనాల శాఖ మంత్రి గా వున్నప్పుడు కూడా నగరానికి ఆనుకొని వున్న నాగావళి నదికి, ప్రజా రవాణా కోసం రెండు ఆధునిక బ్రిడ్జి లు, అంబేద్కర్ విశ్వ విద్యాలయ స్థాపన, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, 80 అడుగుల రోడ్, చిన్న బజార్, బొందిలిపురం రోడ్, వాటర్ టాంక్స్, సమీకృత కలెక్టరు ఆఫీస్ భవన నిర్మాణం, ఆయన ఆలోచనల్లో భాగమే అన్నారు. అందుకే ధర్మాన అంటే మేధావులు, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ, యువత, కార్మిక, వ్యాపారులు, కర్షక,మహిళ, ప్రభుత్వోద్యోగులు కూడా ప్రత్యేక అభిమానం తెలియజేయడం ఆయన పై వారికి ఉన్న నమ్మకం, అభిమానం అని తెలిపారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ఆరోగ్యమే మహాభాగ్యం అని ఎంపిడిఓ ఈశ్వరమ్మ అన్నారు. గురువారం నువ్వుల రేవులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలు చిన్నచూపు చూడటం సరికాదని అన్నారు.అంగన్వాడి కర్యక్రటలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాళ్లను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రా వైస్ సర్పంచ్ దేవా డిప్యూటీ తహసీల్దార్ గిరి రాజు వైద్యులు కనిస్క అంగన్వాడి కార్యకర్తలు ఇందు చామంతి సెక్రెటరీ అదిల్ షా గ్రామ రెవెన్యూ అధికారి కొమ్మాన హైమవతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ద్వారానే గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన

- ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: గ్రామాల్లో ఆలయాలు నిర్మాణం ద్వారా ప్రజల్లో భక్తిభావనతోపాటు గ్రామం ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోగల చిట్టీవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సత్యసాయిబాబా ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సత్యసాయి సేవాసమితి ద్వారా గ్రామాల్లో ఆలయాలు నిర్మాణంతో పాటు యువతకు నైపుణ్యత , స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ ఇచ్చి వారికి అండగా ఉంటున్నారని ఆయన తెలిపారు. సాయి భక్తులు పలు సేవా కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపీపీ వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర కాదు... కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర-పలాస: జిల్లాలో వర్షాలు లేక సాగునీరు అందక రైతులు అల్లాడుపోతుంటే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా బస్సు యాత్ర చేయడం కాదని, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనరు మద్దిల రామారావు అన్నారు. గురువారం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓట్లను ఎలాగ లాగేసుకోవాలో చూస్తుందో తప్పా ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. సకాలంలో వంశధార నీరు అందక పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో వరిసాగు పూర్తిగా ఎండిపోయి నాశనమైందన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఈ క్రాప్‌లో నమోదు చేసి నష్టాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న పేద రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రతి రైతు కుటుంబానికి 50వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు 600 రూపాయలు వేతనం పడేలా చూడాలని కోరారు. వలసకూలీలను నివారించి నెలకు సరిపడే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలను పూర్తిగా మాఫీ చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని కోరారు. నిత్యవసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వంకల అప్పయ్య, పాపయ్య, రామయ్య, సిమ్మయ్యలు పాల్గొన్నారు.

ఏం ప్రగతి సాధించారని సామాజిక సాధికారిక బస్సు యాత్ర

ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర-కవిటి: గడచిన నాలుగున్నరఏళ్లలో వైసిపి పాలనలో ఏం ప్రగతి సాధించారని సామాజిక సాధికారిత బస్సు యాత్ర కార్యక్రమం చేపడుతున్నారని ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే అశోక్ క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టగలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో ప్రజలకు నరకాన్ని చూపించిందని ఎన్నికలు సమీపిస్తుండడంతో పరదాల నుండి బయటకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఏదో చేశానని చెప్పుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.బహిరంగ సభలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎప్పుడు ప్రసంగించిన నా ఎస్సి,నా బిసి,నా ఎస్టి,నా మైనారిటీలని మాట్లాడే ముఖ్యమంత్రి ఈ రోజు వరకు వాళ్లకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు. వెనుకబడిన తరగతులు చేతివృత్తుల వాళ్ళకి అనేక సంక్షేమ పథకాలు 2014-19 వ సంవత్సరంలో టిడిపి పాలనలో అమల్లో ఉండేదని గుర్తు చేశారు.వెనుకబడిన తరగతులకు లోన్లు కల్పించే సదుపాయం గతంలో ఉండేదని నేడు జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో వాటికి అటకెక్కించారని ఎద్దేవా చేశారు.నేడు వైసీపీ పార్టీలో 58 కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్లు నియమించి నిధులు గాని, చైర్మన్ లకు విధులు గాని ఉన్న దాఖలాలు లేవని విమర్శించారు. టిడిపి హయాంలో ఆదరణ అనే పథకంలో భాగంగా మత్స్యకారులకు,వ డ్రంగి పనుల వారికి రజకులకు పరికరాలు ఇచ్చి టిడిపి ప్రభుత్వం ఆదుకుంటే నేటి అధికార పార్టీ వాటన్నిటిని మట్టిలో కలిపిందని ఎద్దేవా చేశారు. నేటి వైసిపి పాలనలో ఎస్సీ, ఎస్టీలు తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్నారని దీనికి ఉదాహరణ ఎమ్మెల్సీ అనంత బాబు చేసిన ఘటన దీనికి ఉదాహరణ అని గుర్తు చేశారు. ఎస్సీలకు అందుతున్న 28 సంక్షేమ పథకాలను నేటి పాలనలో నిలుపుదల చేశారని అన్నారు. అన్నిటి పైన జగన్ పేరు ఫోటో ఉండే దౌర్భాగ్య స్థితిలో నేటి పరిపాలన కొనసాగుతుందని అన్నారు. అంబేద్కర్ పేరున ఉన్న విదేశీ విద్య దీవెన పేరును కూడా తొలగించి జగనన్న విదేసివిద్య దేవనగా మలుచుకున్న దౌర్భాగ్య స్థితిలో నేడు వున్నామని అన్నారు.ఇలా చూసుకుంటూ పోతే ప్రతి ఒక్క సామాజిక వర్గానికి అన్యాయమే చేశారని ఏం చూసి సామాజిక సాధికారిత బస్సు యాత్ర చేపడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్ఛాపురం పట్టణం నడిరోడ్డుపై సామాజిక సాధికారిక సభా ప్రాంగణం పెట్టి ప్రజలకు ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. విజ్ఞత గల ప్రజలు ఇవన్నీ గమనిస్తున్న ఉన్నారని వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పొందల కృష్ణారావు,బెందాళం రమేష్,దక్కత ఢిల్లీ రావు, జగదీష్ పట్నాయక్,సీపాన వెంకటరమణ, కోర్రాయి వాసుదేవరావు,బాసుదేవ్ రౌలో, భీమా రౌలో, పుల్లట రాజు, ఆసి లీలారాణి, బెందాళం సురేష్, బెందాళం తిరుమల రావు తోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి భారీ ర్యాలీగా తరలివచ్చి మండల కేంద్రం మూడు రోడ్ల కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై కె.రాము తన సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే అశోక్ ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం సాధ్యం : పేరాడ తిలక్

విశాలాంధ్ర-నందిగాం: వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్రంలో పేద ప్రజలందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. తిలక్ ఆధ్వర్యంలో గురువారం సామాజిక సాధికార బస్సు యాత్రకు స్వాగతం పలికేందుకు, బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో భారీ ఎత్తున నందిగాం మండల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నందిగాం నుంచి కోటబొమ్మాళి వరకు వెళ్లారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు న్యాయం చేసి, సంక్షేమ పథకాలు రిజర్వేషన్లు కులాలు వారీగా సామాజిక న్యాయం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణ రావు, వైఎస్సార్సీపీ మండల స్థాయి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లు వితరణ

విశాలాంధ్ర-రణస్థలం : అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారు సామజిక బాధ్యతలో భాగంగా రణస్థలం మండలం, సంచాం గ్రామంలో గ్రామీణ అభివృద్ధి కోసం ఐదు లక్షల రూపాయలు ఖర్చుతో వంద ఎల్ఈడీ వీధి దీపాలు, సంచాం గ్రామంలో మరియు పున్నసపాలెం గ్రామంలో రాత్రి వేళలో ఇంతకుముందు ఇబ్బంది పడుతున్న సమయంలో ప్రజల అవసరార్థము ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో సంచాం గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ తరుపున అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారికి దన్యవాధములు తెలియజేశారు. వీధి దీపాలు ప్రారంభోత్సవం కార్యక్రమానికి సంచాం గ్రామపెద్దలు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అరబిందో ఫార్మా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 3వేల మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని, ఈవిధంగా గ్రామ పెద్దలు మరియు గ్రామ పంచాయతీ ప్రతినిధులు అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యం నిత్యానందరెడ్డి, శరత్ చంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

బస్సు యాత్ర విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

వైయస్సార్సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా సంకల్పించిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర ఇచ్ఛాపురం లో గురువారం చేపట్టిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర ప్రారంభం విజయవంతం చేసిన ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు, వైసిపి ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు, వైసీపీ శ్రేణులకు, సోషల్ మీడియా అందరికి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయ కర్త పిరియా సాయిరాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛా పురం నియోజకవర్గంలో వైయస్సార్సీపి జెండా ఎగురవేసేందుకు అందరం కలిసికట్టుగా అడుగు ముందుకు వేసి, ఇచ్ఛాపురం నియోజక వర్గంలో ఎమ్మెల్యేని గెలిపించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కానుకగా అందజేయాలని కోరారు.సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మరొక్కసారి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని తెలిపారు.

సభాపతిని కలిసిన సిఆర్ఎంటిలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: శాసనసభాపతి తమ్మినేని సీతారామును ఆయన క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎంటి) కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాన్ని అందించారు. సమస్యలపై మరియు ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్ (ఎం టి ఎస్) కోసం రిప్రెజెంటేషన్ లో పేర్కొన్నారు. జీవో నెంబర్ 65 ప్రకారం జాబ్ చార్ట్ రూపొందించాలని, అలాగే 23శాతం జీతాల పెంపు కోసం చర్యలు తీసుకునే విధంగా చూడాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. పి.తవిటి నాయుడు, జిల్లా అధ్యక్షులు, బి.గిరి, జిల్లా కార్యదర్శి బి. నర్సింగరావు జిల్లా ఉపాధ్యాక్షులు మరియు సభ్యులు సభాపతిని కలిసిన వారిలో ఉన్నారు.

పంట నమోదు జాబితాలు ప్రదర్శన

విశాలాంధ్ర-మెళియాపుట్టి : ఖరీఫ్ 2023 పంట నమోదు ప్రక్రియకు సంబంధించి రైతుల జాబితాలను ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు తెలిపారు. రైతులు తమ వివరాలను సరి చూసుకోవాలని అలాగే ఏవైనా వివరాలు సరి చేయాల్సి ఉంటే ఆయా ఆర్బీకే పరిధిలోనున్న గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈనెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సాధికారత ఎంటో చూపించాం... తెలుగుదేశాన్ని పెకిలించి పారేయాలి : రెవిన్యూ మంత్రి ధర్మాన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : అధికారాన్ని వినియోగంచుకుని రాష్ట్రాన్ని దోచుకున్న పరిస్థితులను ప్రజలు గమనించారని రాష్ట్ర రెవిన్యూ మన్తరి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ప్రభుత్వం రాష్ట్ర నలు మూలల నుండి చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్ర ప్రారంభ సభలో ఆయన పశు సంవర్ధక శాఖ, విద్యాశాఖ, సామాజిక సంక్షేమ శాఖ మంత్రులు సీదిరి అప్పలరాజు, బొత్స సత్యన్నారాయణ, మేరుగు నాగర్జున, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, జెడ్పీ ఛైయిర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన క్రిష్ణదాస్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. వై.సి.పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో బస్సు యాత్రను విద్యా శాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను మొహరించారు. పాత బస్టాండ్ కూడలి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుండి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమానికి చేపట్టిన పనులను గూర్చి వక్తలు మాట్లాడారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనదైన బాణీలో మాట్లాడుతు పార్టీ శ్రేణులను ఉత్తేజితులను చేసేలా చలొక్తులతో ప్రసంగించి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన స్కామ్‌లను నాగపూర్ కేంద్రంలోని జి.ఎస్.టి విభాగం గుర్తించి అప్రమత్తం చేస్తే అధికారిన్ని వినియోగించుకుని అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సొమ్ములను తన ఖాతాలకు మళ్ళించుకున్న వైనం బట్టబయలైందని అన్నారు. తప్పుడు పత్రాలతో పని చేయని కంపెనీలను సృష్టించి స్కిల్ డెవల్మెంట్ పేరుతో డబ్బులు దోచుకుని, చంద్రబాబు నాయుడు, అతని కుమార్డు లోకేష్‌లకు అత్యంత సన్నిహితంగా ఉంటే వ్యక్తుల ఖాతాలకు మళ్ళించుకున్నారనే అభియోగంతో కేసుల్లో ఇరుక్కున్నారని, దాన్ని ప్రభుత్వం పై నెపం నెట్టి అనవసరంగా ప్రజలను మోసగిస్తూ సానుభూతి పొందడానికి తాపత్రయపడుతున్నారని ఆయన అన్నారు. ఇటువంటి విషయాలను క్షేత్రస్థాయిలో నవతరంతో కూడిన పార్టీ క్యేడర్ ప్రజలకు వివరించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ దొంగలకు అవకాశాలు ఇచ్చి రాష్ట్రాని దొచుకోమని చెప్పాలా ఆలోచించండి అని ప్రజలను కోరారు. ప్రస్తుతం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి బోలెడు పదవులను వై.సి.పి నాయకత్వం ఇచ్చిందని అన్నారు. అనేక కులాలు ఉన్న నియోజకవర్గంలో ఉండే వ్యక్తులకు జెడ్పీ ఛైయిర్‌పర్సన్‌గా, రెడ్డిక కార్పొరేషన్, సీడాప్‌లకు రాష్ట్ర ఛైర్మన్లుగా, ఎమ్మెల్సీగా పిరియా విజయ, దుక్క లోకేశ్వర రావు, సాడి శ్యామ్‌ప్రసాద్, నర్తు రామారావులతో పాటు ఇతర జిల్లా, నియోజకవర్గ స్థాయి సంఘాల్లో ఛైర్మన్లుగా నియమించడంతో పాటు రాష్ట్ర పార్టీ కార్యవర్గంలో కూడా చాలా విభిన్న కులాలకు మందికి స్థానం కల్పించడం జరిగిందని అన్నారు. ఇచ్ఛాపురంలో ప్రస్తుతం వై.సి.పి గెలవడానికి మంచి అవకాశాలు ఉన్నాయని కావల్సిందల్లా పార్టీ క్యేడర్ సమన్వయంతో అహం వీడి పని చేయడమే అని ఆయన అన్నారు. ఈ ప్రాంత ప్రజలు సాధికారత అంటే ఏమిటో స్వయంగా చూసారని, అటువంటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని పెకిలించి వేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ ఎన్నికల సభ కానప్పటికీ సమీపంలో ఎన్నికల వాతావరణం ఉన్నందున, పార్టీ క్యేడర్‌ను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉన్నందున ఇక్కడ వై.సి.పి ఎమ్మెల్యేని గెలిపించాలని కోరుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను

ప్రజలు ఆలోచించాలని, రాష్ట్రంలో 32లక్షల మందికి ఇళ్ళు కట్టిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఈ ప్రాంతంలో కిడ్నీ సమస్యల పరిష్కారానికి మూడు డయాలసిస్‌సెంటర్లతో పాటు పలాసలో రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, హిరమండలం నుండి ఇచ్ఛాపురం వరకూ నీటీని తీసుకొచ్చే భారీ ప్రాజెక్టు చేపడుతున్నామని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా జిల్లాలో నాలుగు వందల కోట్ల రూపాయలతో పోర్టు నిర్మాణం జరుగుతుందని భవిష్యత్‌లో ప్రపంచంలో వివిధ ప్రాంతాలతో శ్రీకాకుళం జిల్లా నేరుగా అనుసంధానించబడుతుందని అన్నారు. తాము అధికారాన్ని అందరికీ పంచి రాష్ట్రంలో అవినీతిని తగ్గించామని చెప్పారు. దేశంలో చాలా రాష్ట్రాలో నిత్యవసరాలు, కూరగాయులు, విధ్యుత్ ధరలు పెరిగాయని ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదని, దాన్ని భవిష్యత్‌లో చంద్రబాబు నాయుడు తగ్గించగలరా? అన్ని ప్రశ్నించారు. అటువంటి సాకులు చూపి వీధుల్లోకి వచ్చే తెలుగుదేశం పార్టీ క్యేడర్‌ను "వెధవ ఏం చెబుతున్నావ్ రా" అని నిలదీసి తరిమియేలని అన్నారు. జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యుడు రామ్మోహన్ నాయుడు ఏం మాట్లాడుతున్నాడని, రాష్ట్ర విభజన తర్వాత 23 కేంద్ర సంస్థలు మంజూరైతే జిల్లాకు ఒక్కటీ కూడా మంజూరు చేయించలేకపోయారని, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు ఏమీ మాట్లాడలేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఏవిధంగా సాధికారత చేపట్టిందో ఖచ్చితంగా చూపించాలని, వై.సి.పి ఏ విధంగా సామాజిక సాధికారత చేపట్టిందో క్యేడర్ ఓటర్లకు వివరించాలని ధర్మాన అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూములను సర్వే చేయిస్తున్నామని, దాంతో రైతులు, ప్రజల చిరకాల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన క్రిష్ణదాస్ అన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రక్షాళన చేసి, పాఠశాలలను వృద్ధి చేయడం జరిగిందని బొత్స సత్యన్నారాయణ అన్నారు. తెలుగుదేశం హయంలో బి.సిలను అణగద్రొక్కారని, గిరిజనులు, ఎస్సీలను అవమానించేవారని, తాము అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ అందరికీ సమన్యాయం చేసి ఎస్సీ, ఎస్టీలకు ఉన్నత పదవులతో పాటు ఉపముఖ్యమంత్రిని కూడా చేసారని పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. వై.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతు అట్టడుగున ఉన్న సామాజిక వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పని చేస్తుందని, రాష్ట్రంలో అభివృద్ధి జరిగి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ నే నమ్ముకోవాలని, అతనే అందరి నమ్మకమని అన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మెల్యే దీక్షల పేరుతో కాలయాపన తప్ప రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఈ ప్రాంతానికి చేసిందేమిటనీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ ప్రశ్నించారు. తాము ఓడినా తమ అధినేత సూచనలతో ప్రజలతోనే ఉన్నామని, సమ్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కళావతి, కంబాల జోగులు, రెడ్డి శాంతి, పాలవలస విక్రాంత్, మారిటైం బోర్డు ఛైర్మన్ కాయల వెంకట్రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయిక్, సచివాలయాల జే.ఏ.సి ఛైర్మన్ సాలిన డిల్లీ తదితరులు పాల్గొన్నారు. ఓ ప్రక్క ప్రసంగాలు జరుగుతుండగానే తరలించిన ప్రజలు ఒకొక్కరుగా వెనుతిరిగారు. దాంతో దారిపొడవున వేసిన కుర్చీలు ఖాళీ అయ్యాయి. జనం పలుచబడినా పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా నాయకుల వెంట ఉన్నారు.

నో రూల్స్

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని పార్టీ అధికారం దక్కించుకుని ప్రజలకు ఎనలేని సేవలను వలంటరీ వ్యవస్థను సృష్టించి ఇంటి వద్దకే అందించి తరిస్తుందని చెప్పుకునే వై.సి.పి నాయకులు ప్రజల ఇబ్బందులను ఏ మాత్రం లెక్కచేయని రీతిలో వ్యవహరించారనే తీవ్ర విమర్శ వెల్లువెత్తింది. రోడ్డుపై ఏ మూలన చిన్న ద్విచక్ర వాహనం పెట్టుకుని నిల్చున్న కయ్ కుయ్ మనే పోలీస్ శాఖ రోడ్డునే ఆక్రమిస్తే నోరెళ్ళ బెట్టుకుందా అన్ని ప్రజలు చర్చించుకున్నారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసుల్లో ఇరుక్కుని జైలు పాలైన తర్వాత, కోర్టులో పెద్ద లాయర్లు గొంతులు చించుకుంటున్నా విడుదలకు సిద్ధం కాని పరిస్థితులను ఎదుర్కొంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఇటీవల చేపడుతున్న నిరసన కార్యక్రమాలు, ప్రజల వద్దకు వెళ్ళి అధికార పార్టీ అరాచకత్వాన్ని నొక్కి వక్కాణిస్తు "బాబుతోనే మేము" అని జనాలతో అనిపిస్తున్న తరుణంలో అందుకు ధీటుగా "మా నమ్మకం నీవె జగన్" అనే కార్యక్రమానికి వై.సి.పి తెరలేపింది. అందులో భాగంగా పార్టీ మ్యానిఫ్యాస్టోకు అనుగుణంగా చేపట్టిన కార్యక్రమాలు, కులాల వివక్షత లేకుండా కల్పించిన అవకాశాలు వివరించి ప్రజల్లో నిలవాలనే తలంపుతో రాష్ట్రం నలుమూలల నుండి సామాజిక సాధికార యాత్రలకు శ్రీకారం చుట్టారు.

గతంలో దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రతిపక్ష నాయకునిగా చేపట్టిన పాదయాత్రతో మొదలు, అనంతరం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా నిర్వహించిన నడకకు తోడుగా నిలిచిన వై.ఎస్ షర్మిల పాదయాత్రలు ఇచ్ఛాపురంలోనే ముగింపు పలికి శిలా జ్ఞాపక రూపాలు ఏర్పాటు చేసుకున్నారు. అందుకు భిన్నంగా తాజాగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను ఇచ్ఛాపురం నుండి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేసుకున్న అధికార పక్షం నాయకులు పట్టణంలో ప్రధాన రోడ్డును మూడు రోజుల పాటు ఆక్రమించారు. దాంతో ప్రజల రాకపోకలకు అవాంతరాలు ఏర్పడ్డాయి. పాత బస్టాండ్ కూడలి వద్దనే బహిరంగ సభకు స్టేజీ నిర్మాణం చేసారు. ప్రభుత్వ సామాజికి ఆసుపత్రికి లేదా, అక్కడి నుండి ఈ ప్రాంత ప్రజల దురదృష్టవసాత్తు ఎక్కువగా క్షతగాత్రులను బరంపురం ఎం.కె.సి.జి కి తరిలించే ప్రధాన మార్గం కూడా అదే. ఇతర మార్గాలు ఉన్నా నేరుగా వెళ్ళడానికి అవకాశం ఉండే ప్రధాన రహదారి. అటువంటి రోడ్డును మూడు రోజుల పాటు అడ్డగించినా ఈ ప్రాంత ప్రజలను భగవంతుడు కనికరించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ప్రాణహానులు లేకుండా ఉన్నాయని ప్రజలు చర్చించుకున్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం కూడలి వరకూ రోడ్డుపై కుర్చీలు ఏర్పాటు చేయడంతో అంతా ముక్కున వేలేసుకున్నారు. ఇటువంటివన్నీ అధికారం దక్కించుకున్నా పక్షానికి ఏ పాటి సామాజిక బాధ్యతో అనేది ప్రజల చర్చ. అధికారం పక్షం సభ కోసం ప్రజలు, వాహనదారులు చుట్టూ తిరిగి పట్టణంలో ఏ ప్రాంతానికి అయినా వెళ్ళేలా పోలీస్ శాఖ ట్రాఫిక్‌ను మళ్ళింపుకు అడుగులేసింది. నోరెత్తలేని ప్రజలు ఉసూరుమంటూనే ఇతర మార్గాలో రాకపోకలు సాగించారు. దాంతో పట్టణంలో పంజా జంక్షన్, గోర్జీవీధి, మార్కెట్ రోడ్డు వంటి ఇరుకు రోడ్లలో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. జనసభకు అవసరమయ్యేంత సురంగి రాజా వారి మైదానం ఉన్నా... పాత బస్టాండ్ లాంటి చిన్నపాటి స్థలంలో సభాస్థలిని ఏర్పాటు చేసి, వీడియో చిత్రీకరణలో భారీ జనసందోహాన్ని చూపించుకుని దూరంగా ఉంటే వారికి భ్రమ కల్గించేలా అధికార పక్షం వ్యవహరించిందని తెలుగుదేశం నాయకులు కొండా శంకర్ తదితరులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేదిస్తూ ప్రజారోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీ కార్యక్రమంలో విపరీతంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. దాంతె అధికార పక్షానికి, పోలీసు శాఖకు నో రూల్స్.... అంటూ జనాలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసారు.

బలవంతపు తరలింపులు దారుణం : జనసేన ధ్వజం

అధికారం ఉందని ప్రజలను ప్రలోభపెట్టడమే కాక, వారిని బెదరించి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఎంత వరకూ సమంజసమని జనసేన మండిపడింది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసి అధికార పక్షం తీరును తీవ్రంగా ఖండించారు. తాము పధకాలతో ప్రజలకు మేలు చేసేస్తున్నాము అని చెప్పుకునే వై.సి.పి నాయకులు, బస్సు యాత్ర సభకు ప్రజలను బలవంతంగా తలరించడం ఏమిటని ప్రశ్నించారు. రోడ్డును అడ్డగించి ట్రాఫిక్ ఇబ్బందులు కల్గించడమే కాక, మహిళా సంఘాల సభ్యులు తప్పక సభకు రావాలని లేకపోతే పధకాలు, కార్డులు ఉండవని బెదిరించిన తీరు ను ఖండిస్తున్నట్లు చెప్పారు. పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తుంటే, వాటి కోసం చెప్పుకున్నప్పుడు స్వచ్ఛందంగా ప్రజలు రావాలని అన్నారు.

చిత్రపటం లేదని శంకుస్థాపన కార్యక్రమాన్ని నిరాకరిస్తారా

ప్రజా సొమ్మును వృధా చేయకండి : శివాల



విశాలాంధ్ర-సరుబుజ్జిలి: కొమనాపల్లి నుండి సరుబుజ్జిలు మీదుగా వెళ్లే జర్జంగి జగన్నాధపురం రోడ్డు 0/0 నుండి 5/735 వరకు సుమారు రూ. 2.20 కోట్ల ఎస్.ఆర్.పి నిధులతో జరుగు పనులకు సరుబుజ్జిలి మండల కేంద్రంలో శంకుస్థాపన చేయడానికి వచ్చిన స్పీకర్ తమ్మినేని, శిలాఫలకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని లేదంటూ అధికారులపై మండిపడడం ఎంతవరకు సమంజసం అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివాల సూర్యనారాయణ మండిపడ్డారు. చిత్రపటం లేదని శిలాఫలక ఆవిష్కరణ నిరాకరించడం సబబు కాదని, సభాపతి హొదాలో ఉన్న తమ్మినేని ఈ విధంగా ప్రవర్తిస్తూ భావితరాలకు ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారో.! అని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ధనాన్ని పార్టీ ప్రచారాలకు వృధా చేస్తున్నారని, ఇలా చిన్నచిన్న సాకులతో ఒకసారి జరగవలసిన పని మరోసారి వాయిదా వేస్తూ.. మరింత ధనాన్ని వృధా చేయడం మంచి పద్ధతి కాదని, చిత్రపటాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి కార్యక్రమాల పైన, ఉద్యోగ కల్పన పైన ఉంటే బాగుండేదని అన్నారు. ఇటువంటి నాయకులను శాసనసభకు పంపించడం ఎంతవరకు సమంజసమో ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలని అన్నారు.

జనంతో వైస్ ఛెయిర్‌పర్సన్

విశాలాంధ్ర- ఇచ్ఛాపురం : వై.సి.పి అధినేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పరి పాలన, వివక్షత లేకుండా అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్న వైనాన్ని ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభ పాత బస్టాండ్ కూడలిలో నిర్వహించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ వైస్ ఛెయిర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి తన వార్డు పరిధి నుండి పెద్ద సంఖ్యలో మహిళలను తరలించడంతో విజయం సాధించారు. వార్డులో తాను మహిళందరితో సఖ్యతగా ఉంటూ వారి సమస్యలకు తోడుగా ఉంటుండటంతో తనతో పాటు బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో మహిళలు పురుషులు కూడా హాజరైనట్లు చెప్పారు. సభలో వేదికపై ఉండటానికే ప్రతీ ఒక్కరు కుతూహలపడే పరిస్థితులకు భిన్నంగా ఆమె చివరి వరకూ జనంతోనే సభా వేదిక దిగువనే ఉండి వారితో మమేకమైయ్యారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు మద్దతు తెలిపిన వైకాపా నాయకులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: వైఎస్సార్‌సీపీ మంత్రులు బొత్స సత్యన్నారాయణ, ధర్మాన ప్రసాధరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావులు చేపడుతున్న శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు వెలుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మండలం అక్కయ్యవలస జంక్షన్ జాతీయరహదారి వద్ద మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బస్సులో వచ్చిన వైకాపామంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మద్దతు తెలిపిన ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, పీఏసీఎస్ అద్యక్షుడు బాడాన మురళి, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల పార్టీ అద్యక్షుడు నూక సత్యరాజు, వైఎస్ ఎంపీపీ దుక్కరోజా రామక్రిష్ణ, వైకాపా నాయకులు పేడాద వెంకటరావు, రొక్కం సూర్యప్రకాష్, గడ్డవలస నాగభూషణరావు, బగాది దివాకర్, పూజారి సత్యం, సింగుపురం వినోద్, సర్పంచ్‌లు గురువెల్లి కేశవరావు, కాళ్ల సంజీవరావు, సంపతిరావు వెంకటరమణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్‌పై వ్యాసరచన

విశాలాంధ్ర-ఆమదాలవలస : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలలో భాగంగా విద్యార్థులకు ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ సెక్సువల్ అరాస్మెంట్ అంశంపై వ్యాసరచన లక్ష్మీ నగర్ విద్యార్థులకు ఆ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ జి ఆర్ పి ఎస్ ఐ శ్రీనివాసరావు పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈ వ్యాసరచనను నిర్వహించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆమదాలవలస మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులకు, మహిళలు మరియు పిల్లలపై జరుగుతున్న లైంగిక చర్యలపై రక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు జి ఆర్ పి ఎస్ ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి రామకృష్ణ తో పాటు జి ఆర్ పి స్టాఫ్ శశికుమార్, రోజా, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.